www.aksharadarbar.com
గురువారం 14, మార్చి 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :40 | సంపుటి :02 | పేజీలు : 06 | వెల : 05

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

- తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు
- విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి..
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

4



సీట్లు.. ఫీట్లు!

- అభ్యర్థుల ఎంపికలో నాటకీయ పరిణామాలు..
- పార్టీ మార్పుతో అభ్యర్థిత్వం ఖరారు..
- మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో అభ్యర్థుల ప్రచారానికి శ్రీకారం..
- వరంగల్ ఎంపీ బరిలో బీఆర్ఎస్ నుంచి కడియం కావ్య ..
- త్వరలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థల ప్రకటన ..
- బీజేపీ నుంచి అరూరికి చాన్స్ ..

2

లోక సభ ఎన్నికల వేడి రాజుకుంటున్నది. తర్వలో పార్లమెంట్ ఎన్నికల ప్రకటన వెలువడనుండటంతో ప్రధాన పార్టీలు ఇప్పటికే కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. మరికొన్ని స్థానాల్లో ప్రకటించాల్సి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా.. అందులో మానుకోట ఎంపీ స్థానం ఎస్టీ రిజర్వ్ అయ్యింది. వరంగల్ ఎస్సీ రిజర్వ్ అయ్యింది. అయితే, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మానుకోట పార్లమెంట్ బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. వారు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రచారం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ ఎస్ పార్టీ కడియం కావ్య పేరును ప్రకటించింది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రకటించాల్సి ఉంది. బీజేపీ నుంచి అరూరికి టిక్కెట్ దక్కే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

- దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి

కన్వర్షన్ కలెక్షన్!

- అక్రమార్జన కోసం రియల్టర్లతో మనీ దోస్తీ
- ముందస్తు అవగాహన కుదుర్చుకుని రిజిస్ట్రేషన్లు
- మూడు ప్లాట్లు రూ.6 కోట్లుగా అక్రమ దందా
- తహసీల్దార్ రజినీరెడ్డి ఇంట్లో జరిగిన ఏసీబీ సోదాలతో మరోసారి తెరపైకి..

2

చట్టంలోని లొసుగులను క్యాష్ చేసుకుంటున్న తహసీల్దార్లు

తహసీల్దార్లు కొందరు చట్టంలోని లొసుగులను సొమ్ము చేసుకుంటున్నారు. రియల్టర్లతో అవగాహన కుదుర్చుకుని అందినకాడికి దండుకుంటున్నారు. వెంచర్లుగా రూపుదిద్దుకున్న వ్యవసాయేతర భూములను వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కన్వర్షన్ చేయలేదనే కారణంతో అగ్రికల్చర్ భూముల రిజిస్ట్రేషన్లను క్యాష్ చేసుకుంటున్నారు. రియల్టర్లతో కలిసి తహసిల్దార్లు కొందరు సాగిస్తున్న ఇల్లీగల్ వ్యవహారం మూడు ప్లాట్లు రూ.6 కోట్లుగా నడుస్తోంది. తాజాగా తహసీల్దార్ రజినీ రెడ్డి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు జరగడం, ఈ సోదాల్లో ఆదాయానికి మించి ఆమె కూడబెట్టిన అక్రమ ఆస్తులు బయట పడటంతో కొందరు తహసిల్దార్ల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధానంగా రజినిరెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న అక్రమ ఆస్తుల వివరాలపై ఆసక్తికర చర్చ జరుగుతుంది. కన్వర్షన్ వ్యవహారమే డిమాండ్ ఉన్న మండలాల్లో పనిచేస్తున్న తహసిల్దార్లకు కాసుల వర్షం కురిపిస్తుందనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అక్రమార్జనే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న తహసిల్దార్ల తీరు ఇపుడు హాట్ టాపిక్ గా మారింది.

– అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి



గంజాయి ముఠా పట్టివేత

పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం

వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం మిల్స్ కాలనీ పోలీసులు గంజాయి ముఠాను పట్టుకుని పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తాము అదుపులోకి తీసుకున్న ముఠా సభ్యులను మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న గంజాయిని ముఠా సభ్యులు ఎక్కడినుంచి వరంగల్ కు తీసుకువచ్చారనే అంశంపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. పోలీసులు వివరాలను వెల్లడించలేదు. వరంగల్ లో గంజాయి రవాణా అమ్మకాలు పెరిగిన నేపథ్యంలో పోలీసులు గంజాయిపై ఫోకస్ పెట్టారు. – అక్షర దర్బార్, వరంగల్

గ్రేటర్ కమిషనర్‌గా అశ్విని తానాజీ

- బాధ్యతలు స్వీకరించిన వాకడే
- కమిషనర్ ను కలిసిన మేయర్

3

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కన్వర్షన్.. కలెక్షన్..!

అక్షరదర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి

- చట్టంలోని లొసుగులను క్యాష్ చేసుకుంటున్న తహసీల్దార్లు
- అక్రమార్జన కోసం రియల్టర్లతో మనీ దోస్తీ
- ముందస్తు అవగాహనతో రిజిస్ట్రేషన్లు
- మూడు ప్లాట్లు రూ.6 కోట్లుగా అక్రమ దందా
- తహసీల్దార్ రజినీరెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలతో మరోసారి తెరపైకి..

కొందరు తహసీల్దార్లు చట్టంలోని లొసుగులను సొమ్ము చేసుకుంటున్నారు. రియల్టర్లతో అవగాహన కుదుర్చుకుని అందినకాడికి దండుకుంటున్నారు. వెంచర్లుగా రూపుదిద్దుకున్న వ్యవసాయేతర భూములను వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కన్వర్షన్ చేయలేదనే కారణంతో అగ్రి కల్చర్ భూముల రిజిస్ట్రేషన్లను క్యాష్ చేసుకుంటున్నారు. రియల్టర్లతో కలిసి కొందరు తహసీల్దార్లు సాగిస్తున్న ఇల్లీగల్ వ్యవహారం మూడు ప్లాట్లు రూ.6 కోట్లుగా నడుస్తోంది. తాజాగా తహసీల్దార్ రజినీ రెడ్డి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు జరపడం, ఈ సోదాల్లో ఆదాయానికి మించి ఆమె కూడబెట్టిన అక్రమ ఆస్తులు బయట పడటంతో కొందరు తహసీల్దార్ల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధానంగా రజినీరెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న అక్రమ ఆస్తుల వివరాలపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కన్వర్షన్ వ్యవహారమే డిమాండ్ ఉన్న మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లకు కాసుల వర్షం కురిపిస్తుందనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అక్రమార్జనే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ల తీరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

లొసుగులతో సొమ్ము..

గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు అన్ని కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రమే జరిగేవి. ధరణి ఫోర్టల్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసే బాధ్యతలను ప్రభుత్వం తహసీల్దార్లకు అప్పగించింది. ఇది కొందరు తహసీల్దార్లకు కాసుల వర్షం కురిపిస్తున్నది. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. ఇదే అదనుగా కొందరు తహసీల్దార్లు అక్రమార్జనకు ద్వారాలు తెరిచారు. లొసుగులను ఆసరా చేసుకుని రియల్టర్లతో అవగాహన కుదుర్చుకుంటున్నారు. ఒప్పందం మేరకు ముడుపులు పుచ్చుకొని వెంచర్లుగా మారిన వ్యవసాయేతర భూములను వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు.

ఇలా జరుగుతుంది..

వరంగల్ మహానగరంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తరిస్తున్న పట్టణాల్లో వ్యవసాయ భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో రియల్టర్లు నగరం, పట్టణాల శివార్లలో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వాటిని వెంచర్లుగా తీర్చిదిద్దుతున్నారు. ఆయా వెంచర్ లో రహదారులు, డ్రైనేజీ వంటివి నిర్మించి 150, 200, ఆ పై గజాలతో కూడిన ప్లాట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాట్లను వ్యవసాయ భూమిగానే కొనుగోలుదారుల పేర స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇందుకోసం ప్లాటుకు అగ్రిమెంట్ ప్రకారం తహసీల్దార్లకు ముడుపులు ముట్టజెపుతున్నారు. ఒక్కో ప్లాటుకు విలువ ఆధారంగా రూ.20వేల నుంచి రూ.50 వేల చొప్పున సమర్పించుకుంటున్నారు. ఇలా ఒక్క ఎకరంలో 15 నుంచి 16 ప్లాట్లను తహసీల్దార్ల సాయంతో వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. విలువైన భూమి అయినా, లేదా ఎక్కువ విస్తీర్ణంలో వెంచర్ చేస్తే స్థానిక తహసీల్దారుకు, తమకు సహకరించినందుకు గిఫ్టుగా ఒక ప్లాట్ ఇస్తున్నారు. ఆ ప్లాటును స్థానిక తహసీల్దారు తన బినామీ పేర రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇలా కొందరు తహసీల్దార్లు చాలా ప్లాట్లను తన బినామీల పేర రిజిస్ట్రేషన్లు చేసి అక్రమ ఆస్తులను పోగు చేసుకుంటున్నారు.

స్వలాభం కోసం...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రియల్టర్లు వ్యవసాయ భూములను వెంచర్లు చేసి ప్లాట్లుగా అమ్మాలంటే కన్వర్షన్ చేయాల్సి ఉంది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చిన తర్వాత ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాకే వ్యవసాయ భూమిని వెంచర్ గా డెవలప్ చేయాల్సి ఉంది. ఈ కన్వర్షన్ ద్వారా ప్రభుత్వానికి ఫీజు రూపంలో ఆదాయం సమకూరనుంది. రియల్టర్లు కన్వర్షన్ చేయకుండానే వ్యవసాయ భూమిలోనే వెంచర్లు చేసి స్థానిక తహసిల్దార్ సహకారంతో ప్లాట్లు అమ్ముతున్నారు. తక్కువ ధరకు లభిస్తుండటం వల్ల కొనుగోలుదారులు కూడా ఈ వెంచర్లలో ప్లాట్లను కొంటున్నారు. రియల్టర్లు ఒప్పందం ప్రకారం డబ్బు ఇచ్చి ప్లాట్లను పట్టాదారు ద్వారా కొనుగోలుదారుల పేర రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ వ్యవహారం వల్ల ప్రభుత్వం ఫీజు రూపంలో వచ్చే ఆదాయాన్ని కోల్పోతుంది. ఇది తెలిసినా తహసిల్దార్లు స్వలాభం కోసం రియల్టర్లను ఈ అక్రమ వ్యవహారంలో ప్రోత్సహిస్తున్నారు. పెద్ద మొత్తంలో ఆస్తులను కూడబెడుతున్నారు. తహసిల్దార్ రజనీరెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులకు లభించిన ప్లాట్ల డాక్యుమెంట్లలో కొన్ని ఇలాంటివే ఉండటం తహసిల్దార్ల అక్రమ సంపాదనకు అద్దం పడుతుంది.

ఎక్కడెక్కడ అంటే..

వ్యవసాయ భూముల్లోనే రియల్టర్లు వెంచర్లు చేసి ప్లాట్లుగా అమ్ముతుండటం, వ్యవసాయేతర భూమిగా మార్చకుండానే విక్రయం జరుగుతున్న ప్లాట్లను వ్యవసాయ భూమిగా తహసీల్దార్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న ఉదంతాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువగా జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జరుగుతున్నట్లు తెలిసింది. వరంగల్ మహా నగరంలో కాజీపేట, హనుమకొండ, ఖిలా వరంగల్ తోపాటు జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ గణపురం, ధర్మసాగర్, హసన్ పర్తి, వర్ధన్నపేట, తొర్రూరు, మహబూబాబాద్, కురవి, నర్సంపేట, ఆత్మకూరు, ములుగు, ఏటూరునాగారం, భూపాలపల్లి, పరకాల తదితర మండలాల్లో ఈ అక్రమ దందా అధికంగా నడుస్తున్నట్లు ప్రభుత్వ నిఘా వర్గాల దృష్టికి వచ్చినట్లు సమాచారం. కొన్నేళ్ల నుంచి ఈ మండలాల్లో పనిచేసిన తహసీల్దార్ల ఇల్లీగల్ వ్యవహారంపై తాజాగా ఏసీబీ అధికారులు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో అవినీతి తిమింగలాలైన కొందరు తహసీల్దార్లలో గుబులు పుట్టింది.

సీట్లు.. ఫీట్లు!

అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి :

- అభ్యర్థుల ఎంపికలో నాటకీయ పరిణామాలు..
- పార్టీ మార్పుతో అభ్యర్థిత్వం ఖరారు..
- మానుకోట పార్లమెంట్ స్థానంలో అభ్యర్థుల ప్రచారానికి శ్రీకారం..
- వరంగల్ ఎంపీ బరిలో బీఆర్ఎస్ నుంచి కడియం కావ్య..
- త్వరలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థల ప్రకటన..
- బీజేపీ నుంచి అరూరికి చాన్స్..

లోక్ సభ ఎన్నికల వేడి రాజుకుంటున్నది. త్వరలో పార్లమెంట్ ఎన్నికల ప్రకటన వెలువడనుండటంతో ప్రధాన పార్టీలు ఇప్పటికే కొన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించింది. మరికొన్ని స్థానాల్లో ప్రకటించాల్సి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా.. అందులో మానుకోట ఎంపీ స్థానం ఎస్టీ రిజర్వ్ కాగా, వరంగల్ ఎస్సీ రిజర్వ్ అయ్యింది. అయితే, మానుకోటపార్లమెంట్ బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రకటించింది. వారు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రచారం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ కడియం కావ్య పేరును ప్రకటించింది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రకటించాల్సి ఉంది. బీజేపీ నుంచి అరూరికి టిక్కెట్ దక్కే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

నాటకీయ పరిణామాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయాలు హాట్ హాట్ గా మారాయి. అక్కడ ట్విస్టుల మీద ట్విస్టులు చోటుచేసుకుంటున్నాయి. నాటకీయ పరిణామాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా వేదికవుతున్నది. ఇటీవల మానుకోట జిల్లా నుంచి సీతారాం నాయక్ బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరి టిక్కెట్

తెచ్చుకున్నారు. ఆయనకు గత పార్లమెంట్ ఎన్నికల్లో టిక్కెట్ రాకపోయినా ప్రజాక్షేత్రంలోనే ఉన్నారు. అంతేకాదు, దేశంలో బీజేపీ గాలి వీస్తోందని, ప్రధాని మోదీ చరిష్మా పనిచేస్తోందని, తన గెలుపు సునాయాసమేనని సీతారాం నాయక్ భావిస్తున్నారు. ఈ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ నుంచి బలరాం నాయక్ బరిలో నిలిచారు. కాంగ్రెస్ టిక్కెట్ కోసం చాలా మంది పోటీ పడ్డారు. చివరికి బలరాం నాయక్ కు దక్కింది. గతంలో ఆయన ఓడిపోవడంతో అదే సానుభూతి పనిచేస్తుందని, ఈ పార్లమెంట్ పరిధిలో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. అంతేకాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుండటంతో ఆయన గెలుపు నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ నుంచి బరిలో దిగిన సిట్టింగ్ ఎంపీ కవిత తను ఎంతో అభివృద్ధి చేశానని, కాంగ్రెస్, బీజేపీపై ఉన్న ప్రజా వ్యతిరేకత తన గెలుపునకు బాటలు వేస్తుందని భావిస్తున్నారు.

- తెరపైకి కావ్య.. బీజేపీలోకి రమేశ్..

వరంగల్ పార్లమెంట్ స్థానంపై ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. బుధవారం వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీజేపీలో చేరుతారని ప్రచారం జరిగింది. ఆయన కూడా ప్రెస్ మీట్ పెట్టి బీజేపీలో చేరే విషయం ప్రకటించే క్రమంలో బీఆర్ఎస్ నేతలు రంగ ప్రవేశం చేసి ఆయనను హైదరాబాదుకు తరలించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో భేటీలో అరూరి పోటీ చేయనని ప్రకటించారు. అంతేకాకుండా, ఆయన గురువారం ఢిల్లీ వెళ్లి బీజేపీ అగ్రనేతలను కలిసినట్లు సమాచారం.. బీఆర్ఎస్ కు చెందిన ఇద్దరు కీలక నేతలు ఇటు అరూరి రమేశ్ బీజేపీలో చేరుతారని, అటూ కడియం శ్రీహరి కాంగ్రెలోకి వెళ్తారనే అంశంపై పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో రకరకాలుగా వచ్చాయి. ఇందులో అనేక ట్విస్టులు, అనుమానాలు, సందేహాలు తలెత్తాయి. అయితే, ఈ అంశాలన్నీ బీఆర్ఎస్ కు తలపోటుగా మారాయి. చివరికి వరంగల్ పార్లమెంట్ స్థానానికి అధిష్ఠానం కడియం కావ్య పేరు తెరపైకి తీసుకొచ్చింది. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆమెకు టిక్కెట్ కేటాయించడంపై ఓ వర్గం వ్యతిరేకిస్తుండగా.. మరో వర్గం మద్దతుగా నిలుస్తున్నది. ఇప్పటికే మానుకోట పార్లమెంట్ స్థానంలో అభ్యర్థులు ప్రచార పర్వానికి తెర తీశారు. వరంగల్ పార్లమెంట్ స్థానంలో కడియం కావ్యప్రచారానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మహిళా సాధికారతే లక్ష్యం..

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

అక్షర దర్బార్ ఎటూరు నాగారం: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకిటి కరుణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి డ్వాక్రా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక నిధితో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు, మహిళల రక్షణ కోసం మహిళా పోలీసులను గ్రామాలు, పట్టణాలకు విస్తరించడం, డ్వాక్రా గ్రూపులకు శాశ్వత బిల్డింగుతో పాటు వడ్డీ లేని రుణాలు అందించడం, మహిళా కమిషన్ బలోపేతం వంటి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. అనంతరం అంగన్ వాడీ టీచర్లకు చీరలు అందజేశారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు..

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

అక్షర దర్బార్, మల్హర్ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాత్రి మల్హర్ రావు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గృహ జ్యోతి, వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాపై ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ను అందజేస్తోందని తెలిపారు. ఇంకనూ ఎవరైనా అర్హులుంటే వారందరికీ ఈ పథకం వర్తింపజేసేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు తగు చర్యలు చేపట్టాలని చెప్పారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అందని అర్హులు ఎవరైనా ఉంటే ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సహాయక కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనంతరం తాడిచర్ల గ్రామంలో తహసీల్దార్ కార్యాలయాన్ని, చేపల విక్రయ ఆటోలను ప్రారంభించారు. వైద్యాధికారి నివాస భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. సమావేశంలో ఎంపీపీ మలహల్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

గ్రేటర్ కమిషనర్ గా

అశ్విని తానాజీ వాకడే..

మేయర్ ను కలిసిన కమిషనర్

అక్షర దర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా అశ్విని తానాజీ వాకడేను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె జీడబ్ల్యూఎంసీ కమిషనర్ గా గురువారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. కాగా, ఆమె ఇంతకు ముందు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా విధులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మేయర్ గుండు సుధారాణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

16న కేడీసీలో మెగా జాబ్ మేళా

అక్షర దర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువత కోసం ఈనెల 16న మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువరం పేర్కొన్నారు. టీఎంఐ ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం పది గంటలకు నిర్వహించే మెగా జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల్లో సూమారు 3 వేలకుపైగా ఉద్యోగ నియామకాలకు అవకాశం ఉందని సీపీ పేర్కొన్నారు. జాబ్ మేళాలో పాల్గొనే యువత కనీసం పదోతరగతి పాసై ఉండాలని, ముందుగా bit.ly/jmform వెబ్ సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి

ఎమ్మెల్యే రేవూరి శంకుస్థాపన

ప్రజా దర్బార్, పరకాల : పరకాల నుంచి ఎర్రగట్టుగుట్ట రోడ్డు మధ్యంలో కంఠాత్మకూర్ వాగుపై రూ.10 కోట్ల వ్యయంతో ఫోర్ లైన్ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గురువారం పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ–పరకాల రెండు జాతీయ రహదారులు కలుపుతూ వెళ్లే రోడ్డు కంఠాత్మకూర్ వాగు వల్ల వర్షా కాలంలో రవాణా వ్యవస్థ దెబ్బతిని ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.7 కోట్లు కేటాయించినప్పటికీ పనులు మాత్రం ప్రారంభించలేదని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో రూ . కోటి 47 లక్షల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లిలో 22 .70 లక్షల నిధులతో పెద్ద చెరువు మరమ్మతు పనులకు, పెద్ద కోమటిపల్లిలో రూ.25.75 లక్షల చేపట్టిన పెద్ద చెరువు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామంలో రూ.5 లక్షల నిధులతో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు, సోమనపల్లి గ్రామంలో రూ.22.25 లక్షల నిధులతో తాళ్లకుంట మరమ్మతు పనులకు, అదేవిధంగా పెద్దంపల్లి గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, గర్మిళ్లపల్లి గ్రామంలో రూ.3 .95 లక్షల నిధులతో అంబేద్కర్ కమ్యూనిటీ భవన ప్రహరీ నిర్మాణానికి, వెల్లంపల్లిలో రూ.10. 82 లక్షల నిధులతో ఊర చెరువు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ హైస్కూల్లో రూ.5 లక్షలతో టాయిలెట్స్ నిర్మాణ పనులకు, రూ.36.42 లక్షలతో పంబాపూర్ పెద్ద చెరువు మరమ్మతు, రూ.10 లక్షలతో మహిళా సమైక్య భవనం, రూ.4.95 లక్షలతో అంగన్ వాడీ భవనం, హనుమాన్ దేవాలయంలో రూ.4.95 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా భూపాలపల్లి పట్టణంలో రూ.80 లక్షలతో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ ఆమ్రపాలి, జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, ఎంపీడీవో అనిల్, నాయకులు సతీష్ గౌడ్, గట్టయ్య, సంపత్, నరేష్, కొయ్యల చిరంజీవి, కృష్ణారెడ్డి, రవీందర్ , ఆకుతోట కుమార్, నడిగొట్టు రాము, సుధాకర్, రామారావు స్వామి, యుగేందర్, తక్కలపల్లి రాజు, శాతరాజు రమేష్, రఫీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పదో తరగతి పరీక్షలు

పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఈ నెల 18 నుంచి జరుగనున్న పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. గురువారం భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో పదోతరగతి పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాల్లో 11 మండలాల నుంచి 3,547 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, 20 మంది సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామని, అలాగే 200 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల్లో విధులు నిర్వహించనున్నారని చెప్పారు. ముగ్గురు సెంటర్ కస్టోడియన్లు, ఇద్దరు రూట్ ఆఫీసర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాంకుమార్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రవీందర్ రెడ్డి, ఎంఈవోలు, ఏఎంవోలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

గనుల్లో పైకప్పు ప్రమాదాలకు చెక్..

- ప్రమాదాలను ముందస్తుగా గుర్తించే ఆధునిక సాంకేతికత
- సింగరేణిలో ఉన్నతాధికారులకు వివరించిన ఆస్ట్రేలియా బృందం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో ఏర్పాటుకు పరిశీలన
- సీఎండీ ఎన్.బలరాం

పరికరం పనితీరును వివరిస్తున్న నోమ్ ప్రతినిధులు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూగర్భ గనులను నూరు శాతం ప్రమాదరహిత గనులుగా రూపొందించడం కోసం సింగరేణి యాజమాన్యం అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని, మేలైన సాంకేతికతను వినియోగించడానికి సింగరేణి సిద్ధంగా ఉందని సంస్థ సీఎండీ ఎన్.బలరాం పేర్కొన్నారు. భూగర్భ గనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో పరిశీలించారు. దీంతో పైకప్పు ప్రమాదం జరగక ముందే గనిలోని కార్మికులను హెచ్చరిస్తూ ఫ్లాష్ లైటింగ్, సైరన్ ద్వారా అప్రమత్తం చేస్తుంది. దీని వల్ల ప్రమాదాన్ని నివారించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకొని, ప్రాణ నష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుంది. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణి సంస్థలో కూడా వినియోగించాలని కోరుతూ ఆస్ట్రేలియాకి చెందిన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్ ఓవెన్, జనరల్ మేనేజర్ కెసన్ ఫిన్ లెన్ సంస్థ సీఎండీ ఎన్.బలరాం, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్అండ్ డీ), ఎస్డీఎం సుభానికి డెమో స్టేషన్ ద్వారా వివరించారు. దీనిపై ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి వివరిస్తూ ప్రమాదాల నివారణకు ఇప్పటికే సింగరేణి సంస్థ అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందని, భూగర్భంలో పైకప్పు కిందికి జారడంపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే కొత్త సాంకేతికతతో ప్రమాదాలను నూరు శాతం అరికట్టే అవకాశం ఉందన్నారు. జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డీ) ఎస్డీఎం సుభాని మాట్లాడుతూ ఆస్ట్రేలియా బృందం ఇచ్చిన డెమోను పరిశీలించామని, దీనిపై ఉన్నత స్థాయిలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

విధినిర్వహణలో అలసత్వం వద్దు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, హనుమకొండ: వ్యక్తిగత భద్రతా సిబ్బంది తమకు అప్పగించిన విధుల్లో అలసత్వం వహించవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ కమిషన రేటుకు చెందిన వ్యక్తిగత భద్రతా సిబ్బందికి మూడు రోజుల శిక్షణ తరగతులను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ప్రారంభించారు. ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో వ్యక్తిగత భద్రతా సిబ్బంది నిర్వహించాల్సిన విధులతో పాటు వీఐపీలకు భద్రత కల్పిస్తున్న వ్యక్తులను శత్రువుల బారి నుంచి సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సంబంధిత విభాగం అధికారులు వివరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ వ్యక్తిగత భద్రతా సిబ్బంది శత్రువులకు ఎలాంటి అవకాశం కల్పించినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. భద్రతా సిబ్బంది ముందస్తు అంచనాలను వేసుకోవాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటే వీఐపీలకు ఎలాంటి ప్రమాదం ఉండదని అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు సురేష్ కుమార్, రవి, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, శ్రీధర్, చంద్రశేఖర్, పోలీస్ సంఘం అధ్యక్షుడు శోభన్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కురుమలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జిల్లా గౌరవ అధ్యక్షుడు కడారి జనార్దన్

అక్షర దర్బార్,రేగొండ : కురుమ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ యువ చైతన్య సమితి భూపాలపల్లి జిల్లా గౌరవ అధ్యక్షుడు కడారి జనార్దన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కురుమ కులస్తులు ఎంతో దోహదపడ్డారని, రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న కురుమలను ప్రత్యేకంగా కాకుండా గొల్ల కులస్తులతో కలిపి కార్పొరేషన్ చేయడం సరికాదన్నారు. తక్కువ జనాభా ఉన్న కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పుడు కురుమ కులస్తులను చిన్న చూపు చూడడం వారి అభివృద్ధికి అడ్డుకట్ట వేసినట్టే అవుతుందని అన్నారు. కురుమ కులస్తులు బీసీ బీ, యాదవ కులస్తులు బీసీ డీ ఉన్నప్పుడు వీరికి ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అంటే కాంగ్రెస్ పార్టీది మోసపూరిత కుట్ర అని విమర్శించారు. కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తాగునీటి సరఫరాకు అన్ని చర్యలు

మంత్రి పొన్నం ప్రభాకర్

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి

హనుమకొండ: ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో రూ.9.07 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన బాధ్యత అని అన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని తెలిపారు. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఎల్కతుర్తి మండలంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగేళ్ల నగేష్, ఆర్డీవోలు వెంకటేష్, రామ్మూర్తి, జెడ్పీ సీఈవో విద్యాలత, ఎంపీడీవో విజయ్ కుమార్, ఆర్అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల


వధూవరులను ఆశీర్వదిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్, పరకాల : దామర మండలం ఉరుగొండ గ్రామానికి చెందిన విద్యార్థి ఉద్యమ నాయకుడు కొమురయ్య వనమాల కొడుకు గొల్లపల్లి వేణు-కావ్య వివాహం గురువారం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బంది రాలేదు..

ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ నాయక్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పర్యటనలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదని ఎన్పీడీసీఎల్ జయశంకర్ భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్హర్ రావు మండలంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు బుధవారం జరిగాయని, ఈ కార్యక్రమాలు మొత్తం మూడున్నర గంటల పాటు కొనసాగాయని పేర్కొన్నారు. 33 కేవీ లైన్ లో ఎర్త్ సమస్య తలెత్తడంతో కేవలం నాలుగు నిమిషాల్లోనే సరఫరాను పునరుద్ధరించామని ఆయన అన్నారు. పని కట్టుకొని కొందరు విద్యుత్ శాఖపై లేనిపోని నిందారోపణలు చేస్తున్నారని, విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నారని అన్నారు. అధికారిక కరెంట్ కోతలు లేవని, విద్యుత్ శాఖపై దుష్ప్రచారం చేయడం సరైనది కాదని తెలిపారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

మంత్రి శ్రీధర్ బాబుకు కార్మికుల వినతి

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

అక్షర దర్బార్, మల్హర్ : పనికి తగిన వేతనం ఇవ్వాలని తాడిచర్ల ఓసీపీలో పనిచేసే ఆపరేటర్లు కేసారపు సురేందర్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సమాన పనికి సమాన వేతనం చట్టం కింద జీవో 22 ప్రకారమే వేతనం ఇస్తామని ఒప్పుకుని ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గనుల నుంచి వచ్చే దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమాన పనికి సమాన వేతనం, పని భద్రత కల్పించి, మెడికల్ రీయింబర్స్ మెంట్ పెంచాలని వారు కోరారు. కార్యక్రమంలో మేడ అశోక్, రవికిరణ్, జె ప్రశాంత్, బాడిద నరేష్, బుర్ర రాజు, విష్ణు వర్ధన్, ఇందారపు వెంకటేష్, తరుణ్ బృందం, రాకేష్, భూమయ్య కుమార్, మేనం నరేష్, అనసూరి చంద్రమౌళి ఉన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా బుక్ ఫండ్..

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : డీఎస్సీ పోటీ పరీక్షకు సన్నద్ధమయ్యే బీసీ నిరుద్యోగులకు బుక్ ఫండును ఉచితంగా అందజేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్ ఫండ్ ను పొందగోరు విద్యార్థులు ఈనెల 14 నుంచి ఏప్రిల్ 5వరకు ఆన్ లైన్ లో www.tsbcstudycircle.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి నిరుద్యోగ విద్యార్థికి రూ.1500 చొప్పున ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్స్ 0870-24071178, 040- 24071178, 040-27077929 ద్వారా సంప్రదించాలని కోరారు.

సుధాకర్ రావు మృతి తీరని లోటు

నివాళులర్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అక్షర దర్బార్, తొర్రూర్ : అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే నెమరుగొమ్ముల సుధాకర్ రావుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాళులర్పించారు. తండ్రి యతిరాజారావు బాటలో ప్రజాసేవకు అంకితమై, నియోజకవర్గ ప్రజలకు అప్పుడిగా ఉన్న సుధాకర్ రావు మరణం బాధాకరమని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం సుధాకర్ రావు కుటుంబ సభ్యులను కడియం పరామర్శించారు.